


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# గుండమ్మ కథ - 1

కథ: చక్రపాణి; మాటలు: డి.వి.నర్సరాజు; పాటలు: పింగళి నాగేంద్ర రావు; తారాగణం: స్టిల్స్: NTR, ANR,SVR,సావిత్రి, జమున ( అప్పటికే actors మధ్య ego problems మొదలైనందున టైటిల్సులో ప్రక్కప్రక్కనే ఫోటోలు Photo Montageగా చూపించారు.) సూర్యకాంతం, ఛాయా దేవి, రమణారెడ్డి, రాజనాల, హరనాథ్, ఈ.వి.సరోజ,–వరకు ఫోటోలు; తర్వాత పేర్లు; ఋష్యేంద్రమణి, హేమలత, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య, బాలకృష్ణ, రాజు,బొడ్డపాటి; Director of Photography: Marcus Bartley; Director of Audiography: A.Krishnan, B.A., Sound Engineer: V.Sivaram, B.A. B.Sc., Processed by: SenGupta,B.Sc.,Special effects: Harbans Singh; Publicity: K.Nageswara Rao, Electrician: M.SankaraNarayanan; కళ:గోఖలే,కళాధర్; సంగీతం: ఘంటసాల వెంకటేశ్వర రావు; నృత్యం: పసుమర్తి కృష్ణమూర్తి; ఎడిటింగ్: జి.కల్యాణసుందరం, డి.జి.జయరాం; నేపథ్య గానం: ఘంటసాల, సుశీల, లీల; మేకప్: పీతాంబరం,భక్తవత్సలం; టెక్నికల్: సి. కుప్పుస్వామి నాయుడు, కె.శ్రీనివాసన్, ఆర్.జయరాం రెడ్డి, యం.గోపాలపిళ్ళై; నిర్మాణ సహాయకులు: చలపతి రావు, జగన్నాథ్; సహాయ దర్శకులు: నాగేశ్వర రావు,బి.ఏ., కె.బాబూరావు తదితరులు; Produced at: Vauhini Studios; Processed at: Vijaya Laboratory; Recorded on: Westrex Electric Sound system; Produced by: NagiReddi & Chakrapani; నిర్మాతలు: నాగిరెడ్డి,చక్రపాణి; దర్శకుడు:కె.కామేశ్వర రావు, బి.ఏ.,

★★★

(నేపథ్యంలో–కొక్కొరోకో) అరకొర వెలుతురులో రోట్లో గింజలు దంచుతూ గుండమ్మ సవితికూతురు. సహజంగా సాత్వికురాలు. గుండమ్మలేచి తలుపుతీసుకుని ఆవులిస్తూ పెరట్లోకి వస్తుంది. –అబ్బబ్బబ్బబ్బ. ఓ లక్ష్మీ .అప్పుడే తెల్లారిందా నీకు? అర్ధరాత్రివేళ ధమాధమా అంటూ ఏమిటా చప్పుడు? మమ్మల్నేం నిద్రపోనివ్వవా? (స్థితిమంతురాలైనా గుండమ్మది మగదక్షతలేని సంసారం. ఆమె పరమ గయ్యాళి. కాని,లోక జ్ఞానం లేని అమాయకురాలు. సవితికూతురిచేత నడ్డివిరిగే చాకిరీ చేయిస్తూ సొంత కూతురిని అతిగారాబం చేసి పెంచుతుంది. కొడుకు చదువుకున్నవాడైనా సంసారబాధ్యతలు పట్టించుకోడు,)

లక్ష్మి: కోడికూసింది. తెల్లారిందేమోననుకున్నాను.

గుండమ్మ: ఆ కోడికూడా నీలాంటిదే. పనిలేకకూర్చుంటుంది. మూడుగంటలేనా కాలేదు ఇంకాను. ఇదిలావుంచి ఆ పాచిపని చూసుకో..

ల: అలాగే పిన్నీ.

గుం: ఆ పనివాడు ఏమయ్యాడు?

ల: ఈ ఇంట్లో పని చెయ్యలేనని వెళ్ళిపోయాడు.

గుం: పోయాడూ? నేననుకుంటూనేవున్నాను. (లక్ష్మి తలపైమొట్టి) నీ చేతికింద ఎవడు పనిచేస్తాడే? పో.త్వరగా కానీ.

★★★

ఫ్రేములో రౌడీ గెటప్‌లో గంటయ్యకొడుకు ఫొటో. గంటయ్యది దూరపు చుట్టరికం. వరసకి గుండమ్మకి అన్న.)

గంటయ్య: ఖర్మ పొద్దున్నేలేచి వీడిమొహం చూడాల్సివచ్చింది. —ఫొటోఫ్రేమ్ వెనక్కి తిప్పేస్తాడు. —ఏమే. ఏం చేస్తున్నావే? అయ్యయ్యో. టైమైపోయింది. త్వరగా తీసుకురావే.

భార్య– పాలబిందెలు సరిచేస్తుంది.;:ఏంటా  హడావిడీ? ఏం ముంచుకుపోయిందనీ?

గంటయ్య పాతకోటు తగిలించుకుంటూ: నీకేం తెలుసే? మన పాలు లేనిదే కాఫీయే లేదు. కాఫీ లేనిదే కాఫీ హోటలేలేదు. హొటల్ లేకపోతే ఈ వూళ్ళొ జనానికి బతుకేలేదు. ( కాఫీగతప్రాణుల శకం ఆరంభం).మనం పాలు ఎంత త్వరగా సప్లయ్ చేస్తే ఊళ్ళో పనులు అంత త్వరగా ఐపోతాయి. అసలు ఇది వ్యాపారమేకాదు. దేశసేవకూడా.

భార్య: దేశసేవ తర్వాతగాని ముందు మన సేవకానీ. మరి మన అబ్బాయి ఎప్పుడొస్తాడెమిటి?

గం: వస్తాడు. ఊరునుంచా?– ఉత్తరం రాస్తే రావడానికి? జైలు! నేను లెక్కలేసి చూశానులే. ఇంకా రెండునెలలకిగాని రాడు.

భార్య: సరేలే. వాడొచ్చేలోపల గుండమ్మకూతురి పెళ్ళయిపోతే?

గం: ఎలా ఔతుందే? నేనులేనూ? వచ్చిన సంబంధాలన్నీ వాకిట్లోంచే పంపించేస్తుంటే?

భార్య: అవి చెడగొడితే మనకేం వస్తుందయ్యా? మనబ్బాయి పెళ్ళి కావాలిగాని?

గం: అందుకేనే. ఎవ్వర్నీ రాకుండాచేస్తే గతిలేక మనకే ఇస్తుంది. నువ్వుకూడా ఆవిడతో కాస్త మంచిగా ఉండవే అంటే (నీళ్ళు నములుతాడు)

భార్య: ఆ౦.ఆ౦. నేను దానితో ఛస్తే మాట్లాడను. నాకొడుకు పెళ్ళయేదాకా దాని గడపకూడ తొక్కను.

గంటయ్య పాలబిందె తీసుకుని: అదిసర్లేకాని నీళ్ళు ఏమాత్రం కలిపావ్? వాడు ఊరికే గొడవపెడుతున్నాడు.

భార్య: నీళ్ళా? పళ్ళురాలగొడతా.

గం: నేనుకాదే. హొటలువాడు. — గేటు బయట ఆడమనిషికి పాలుపోసి అటూఇటూచూసి బిందెలో ఆ మేరకి మునిసిపాలిటీ కొళాయి నీళ్ళు కలుపుతాడు.

★★★

హొటల్లో–నేపథ్యంలో ...ఒక ఇడ్లీ పెసరట్– ఒక సింగిల్ పెసరట్.

గంటయ్య: ఇవిగో పాలు.

సర్వర్: ఏమిటయ్యా.ఒఠ్ఠి నీళ్ళు?

గం: ఈ మధ్య మా గేదె నీళ్ళు జాస్తీగా తాగుతోందిలే.

సర్వరు: ఐతేవుండు. మా ప్రొప్రయిటర్ తో చెప్తాను.

గం: ఏంటయ్యా చెప్పేది? నువ్వేనా తర్వాత నీళ్ళు కలపాల్సిందేగా? ఆ పని ముందుగా చేసేశాను. (దబాయింపు)

సర్వరు: ఐతే పైసలు అక్కర్లేదన్నమాట. నువ్వేనా ఖర్చుపెట్టాల్సిందేగా? ఆ పని నేనే ముందుగా చేసేశాను.

గం: బాబ్బాబు. ఎంతైనా మనం మనం ఒక్కటి. (కాళ్ళబేరం)

సర్వర్: అట్లారా దారికి.

గంటయ్య వంటవాడితో——ఒక డబల్ రోస్ట్ పెసరట్టువెయ్యి. ఉల్లిపాయలు, మిరపకాయలు, అల్లం జాస్తీగావెయ్యి. ఏవి౦టయ్యా– నువ్వుందు నే వేసుకుంటా. నువ్వుపో. తెడ్డు తీసుకుంటాడు.

(నేపథ్యంలో – అరవైఐదు నయాపైసలు( బేడలు, అణాలకి కాలం చెల్లి రూపాయికి నూరు నయాపైసలు అమల్లోకి వచ్చిన కాలం).

సర్వరు ఇడ్లీప్లేటు టేబిలుపై విసురుగా పెడతాడు.

కస్టమరు: ఏంటా తలపొగరు?

సర్వరు: నాకు తెలిసింది ఇంతే. తింటేతిను. లేకపోతే పో. –ఆం. ఫ్యామిలీ ఎనభైఐదు నయాపైసలు. –విసురుగా ప్రొప్రయిటర్ దగ్గరికిపోతాడు.

ప్రొ: కస్టమర్ తో మంచిగా మర్యాదగ ఉండాలిరా.

సర్వర్: కుదర్దండీ. మీరే సప్లయ్ చేసుకోండి.

ప్రొ: నా హొటల్లో నేనే సర్వ్ చేసుకోవాలా? ముందు బైటికిపో.

సర్వరు పోతూపోతూ–అదుగో ఆ పెసరట్టు దగ్గర అల్లంపచ్చడి. ఇడ్లీ దగ్గర కొబ్బరిపచ్చడి.———అప్పగింతలు.

గంటయ్యవచ్చి: అర్జంటుగా 10 రూపాయిలు కావాలి.

ప్రొ: లేవయ్యా.

గం: పాలుపోయించుకుని లేవంటే ఎలా?

ప్రొ:నువ్వు తిన్నదానికి నువ్వే నాకుబాకీ.

గంటయ్య అక్కడ కౌంటర్‌పై న్యూస్ పేపర్ తీసుకుని——బస్సుకిందపడి మనిషిమరణం. మనిషికాకపోతే బస్సు చస్తుందా? విషం తాగి భర్తభార్య నలుగురు పిల్లలు దుర్మరణం. పీడాపోయింది. జనాభా తగ్గింది. ప్రమాదంలో యాభైమంది మృతి. ఛఛఛ. అన్నీ చావుకబుర్లేనా? ఆకలిచావులని మొదటి పేజీలో. పాడు పేపరు.

★★★

లక్ష్మి పూలపళ్ళెం పట్టుకుని నిలబడగా గుండమ్మ నిలబడి భర్త చెప్పులకి పూజ చేసి కళ్ళకి అద్దుకుంటుంది. పైన పెద్ద ఫ్రేంలో భర్త ఫొటో.

గుం: ఇవాళ టిఫిన్ ఏం చేశావ్?

ల: ఉప్మా.

గుం: ఔను. ఉప్మా చెయ్యడం తేలిక కదూ? కాస్త గారెలుచేసి పడెయ్యరాదూ?

ల: ఇప్పుడు చేస్తాను పిన్నీ.

గుం: మరి వెళ్ళు. ఇంకా నిలబడ్డావేం? –గదమాయిస్తుంది. : సరోజకి కాఫీ ఇచ్చావా?

ల; నిద్రపోతోంది పిన్నీ.

గుం: పోనీ కంటినిండా నిద్రయినా పోనీ.(వివక్ష). దాన్ని తలంటి స్నానం చెయ్యమని చెప్పు.

ల: నువ్వు చెప్పు పిన్నీ. నామీద ఎగిరిపడుతుంది.

గుం: చెప్పేవిధంగా చెప్తే ఎందుకు ఎగుర్తుందీ? చెప్పడం కూడా హేతకాదు. –భర్త ఫొటో వైపు చూసి——నీకేం మహారాజువి. ఈ సవితికూతుర్ని నా నెత్తిమీద పారేసి హాయిగాపోయి స్వర్గం లో కూర్చున్నావు. ఈ సంసారం ఈదలేక నేను చస్తున్నాను. (నేపథ్యంలో–అమ్మాయ్?)——గంటన్న ప్రవేశం.

గం: చావులు చావులు చావులు! పేపరునిండా చావు కబుర్లేనా? శుభమా అంటూ నాలుగు పెళ్ళి కబుర్లు వెయ్య కూడదూ? మన సరోజకి వరుడు కావాలని పేపర్లో వేయించేద్దాం.

గుం: ఏమిటేవిఁటీ? పేపర్లో వేస్తావా? ఎక్కడా గతిలేనట్లు? (నామోషీ)

గం: ఏం చెయ్యమంటావు చెప్పు? నేనుమాత్రం ఎన్ని సంబంధాలు తీసుకురాను? అప్పటికీ చుట్టుపక్కల ఊళ్ళన్నీ తెగతిరుగుతున్నాను చెల్లాయ్. దేశం లో మనకింత గొప్ప పేరుందని నాకింతవరకూ తెలీదు. ఎక్కడికి వెళ్ళినా గుండమ్మగారి సంబంధమా? అమ్మ బాబోయ్! మాకొద్దని అదిరిపోతున్నారు. నువ్వు బావకి మందుపెట్టి చంపావని నా మొహాన అడుగుతున్నారు. ఔను చెల్లాయ్. నీ మీద దుష్–propaganda జరుగుతోంది.

గుం: ఆరాటంగా——ఎవరికొచ్చిందీ పోయేకాలం? నేనెవరికి అపకారం చేశాను?

గం: ఎవరో ఎందుకు? ఇంట్లో వాళ్ళే. నీ మారుకూతురు లక్ష్మి లేదూ? ఇరుగుపొరుగువాళ్ళతో వాగుతోంది. వాళ్ళూరుకుంటారా? ఊరంతా ఏకిపెట్టారు. (అబద్ధాలు, చాడీలు)

గుం: ఔను అన్నయ్యా. ఇది నాకు పెద్ద బెడదైపోయింది. ఇది నా ఇంట్లో ఉన్నంతవరకూ నా కూతురికి పెళ్ళికాదు. వచ్చినవాళ్ళంతా దీన్నిచూసే వెనక్కిపోతున్నారు. ఎవర్నన్నా దారినపోయేవాణ్ణి చూడన్నయ్యా. ముడెట్టేద్దాం.

గం: అదెంతపనిలెద్దూ. చేసేద్దాం. ముందు సరోజ సంగతి తేల్చు. నువ్వుమాత్రం ఎంతకని తిరుగుతావ్? (గొంతు సవరించుకుని బెదురుతూ) నా మాటవిని మా అబ్బాయికిచ్చి పెళ్ళిచేసెయ్యి.

గుం——కోపంగా: అన్నయ్యా, నీకెన్నిసార్లు చెప్పాను? మళ్ళీ నీ కొడుకు ప్రస్తావన తెచ్చావో నా గడప తొక్కొద్దు. నా కూతురి సంబంధం నేను చూసుకొంటాలే. శాస్త్రులుగారు సంబంధం తెచ్చారు.రామభద్రయ్యగారి కొడుకు నచ్చాడని.

గంగం——ప్లేటు ఫిరాయించి,సంతోషం నటిస్తూ——ఓహోహో అలాగా. మంచి సంబంధమే. ఏవిఁటో దానిపోరు పడలేక వాగాను. ఐనా నీ కూతురు మా ఇంటికి వచ్చి ఎన్నాళ్ళుంటుందిలే? ( మేడ మీద సరోజలేచి నిద్ర కళ్ళతో) అమ్మా.కాఫీ.

గుం——లేచి——ఇదుగో పంపిస్తానమ్మా. లక్ష్మీఓ లక్ష్మీ.

గం: తనలో——రామభద్రయ్య కొడుక్కిస్తావేం? ఎలా ఇస్తావో చూస్తాను.

★★★

రామభద్రయ్య గారిల్లు. శాస్త్రులు–– రామరాంభద్రయ్యగారికి సరోజ ఫొటో చూపిస్తూ–– : పిల్ల ఫొటోలో కంటే ఇంకా బాగుంటుందిలెండి. కొద్దిగా ఇంగ్లీష్ కూడా చదువుకుంది. పాపం తండ్రిలేదు. అందుకే గారాబంగా పెంచింది. ఇంటిపెత్తనమంతా తల్లిదేలెండి. కట్నం విషయం లో మీరేమీ సందేహించనక్కరలేదు.

రామభ: ఇంకా పిల్లలెవరైనావున్నారా?

శా: ఒక కొడుకున్నాడు. ఒక మారుకూతురుంది. ఆ పిల్లకి కట్నాలు వగైరా ఇచ్చే పనిలేదు. ఉన్నదంతా ఈ పిల్లకే.

రా.భ: ఏమాత్రం ఇస్తారేవిఁటి?

శా: రొఖ్కం ,నగలు కలిపి ఒక లక్ష (1962)వస్తుంది. తల్లిపేరునవున్న ఇల్లు,పొలము పిల్లకే వస్తుంది. ఇంకేమైనా కావలసివుంటే అడగండి. చెప్పి ఒప్పిస్తాను. తమతో సంబంధం చెయ్యాలని ఆమెకు గట్టి పట్టుదలగావుందండి.

రా.భ: సరే. మాకిద్దరబ్బాయిలున్నారయ్యా. వాళ్ళిద్దలో ఎవరిష్టం...

శా: మీ ఇష్టం. మీరుచూసి ఏ పిల్లవాడికి చేసుకున్నా ఆమెకి అభ్యంతరం లేదు. పైగా అల్లుడిని ఇల్లరికం ఉంచుకోవాలని ఆమె ఆశ.

రా.భ.: ఇల్లరికమా?

శా: ఆఁ. ఔను. ఇల్లరికంవుంచడం మీకిష్టం లేకపోతే మీరే స్వయంగా మాట్లాడుకోవచ్చు.

రా.భ: పిల్లబాగుంది. పైగా కట్నంకూడా ఇస్తామంటున్నారు. మరి ఇంతదూరం వచ్చారేవిఁటయ్యా? దగ్గర్లో సంబంధమేమీ దొరకలేదా?

శా: ఏం చెప్పమంటారు? అక్కడ గుండమ్మగారికి గంటన్న అని మారుటన్న ఉన్నాడు. వచ్చిన సంబంధాలన్నీ చెడగొడుతున్నాడు.

రా.భ: అందుకని?

శా: పిల్లని అతని కొడుక్కి చేసుకోవాలని అతని ఆశ.

రా.భ: మరి అతని కొడుక్కే ఇచ్చేస్తే పోతుంది కదయ్యా? చుట్టరికం కలిసివస్తుందికదా? ఆస్తి వాళ్ళకే కలిసి వస్తుంది.

శా: రామరామ. వాడికి అన్ని లక్షణాలూవున్నాయి. ప్రస్తుతం జైల్లో వున్నాడు.

రా.భ,––పరిహాసగర్భితంగా: ఆహాఁ. సరే. నేవచ్చి పిల్లను చూస్తాలెండి.

శా: వచ్చేముందు కాస్త ఉత్తరం ముక్క రాయించండి. అడ్రసు ఫొటో వెనకనేవుంది.

రా.భ: గుట్టుపోగుల గుండమ్మ. వాళ్ళది దుర్గాపురం కదూ?

శా: ఔను. మొదటిభార్య పోయినతర్వాత రెండవ సంబంధం చేసుకుని ఇల్లరికం వచ్చేశారు. పాపం.ఇప్పుడు లేరు.

రా.భ: సరే.నేను అక్కడికివచ్చి చూస్తాను. శా: వచ్చేముందు ఉత్తరం రాస్తారుకదూ?

రా.భ.–లేచి: అలాగే.——శాస్త్రులు నమస్కరించి వెళ్ళిపోతాడు. –నౌకరుతో——వెంకన్నా?——వాడుపోయి చిలకకొయ్యకి తగిలించిన కండువా, చేతికర్ర తీసుకురాగా బయటకి బయలుదేరుతాడు.

★★★

(రాజా కారులో బయల్దేరి బంగళాకి వెళ్తాడు.)అక్కడ——

అన్న ఆంజనేయ ప్రసాద్: రా తమ్ముడూ. ఏమిటి విశేషాలు?

(సశేషం)

COMMENTS